
కథ

# వంటింట్లో ఒకరోజు

బి. రఘురామరాజు




**"నాకు పెద్దాపరేషన్ అయినప్పుడు, పాపం, మా చెల్లెలు నెల రోజుల పాటు మనింట్లో ఉండి, వంటా వార్పూ చూసుకుంది. ఇప్పుడు దానికి ఆపరేషన్ అయితే, వెళ్లి కనీసం ఒక్క రోజైనా సహాయ పడకపోతే ఏం బావుంటుంది చెప్పండి?!" నిష్ఠూరంగా అంది మా ఆవిడ.**

"వద్దనడానికి నేను మాత్రం కసాయివాడినా? కాకపోతే, ఆ ఒక్కరోజు వంట ఎలాగా అని ఆలోచిస్తున్నాను అంతే!" సౌమ్యంగా అన్నాను.

"వంట...వంట. వంట నడ్డంగా పెట్టుకుని, పెళ్లైన ఈ పదిహేను సంవత్సరాలలో పదిహేను రోజులు ఎక్కడికైనా నన్ను వెళ్లనిచ్చారా? వంట దేముందండి...అదేం బ్రహ్మవిద్యా! ఆ ఒక్కరోజు మీరేం తంటాలు పడతారో నాకు తెలియదు. ఈ ఆదివారం నేను మా చెల్లె లింటికి వెళుతున్నాను అంతే!" కాస్త కటువుగానే అంది మా ఆవిడ.

ఓ మెట్టు దిగక తప్పలేదు నాకు.

"అలాగే వెళ్దువుగాని. కాని ఓ చిన్నమాట. రెండు పూటలకు సరిపడా అన్నం, సింపుల్‌గా ఒక కూరగాయ ఎలా తయారుచేసుకోవాలో ఈ కాగితంమీద రాసివ్వు చాలు" అంటూ ఓ ప్యాడ్, కాగితం, పెన్నూ అందివ్వబోయాను.

"ఇంతవరకూ కనీసం ఓ వందసార్లైనా ఇలా రాసిచ్చి ఉంటాను. కనీసం గ్లాసెడు అన్నం వండుకునే స్థాయికైనా ఎదిగారా మీరు? వంటంటే కథో, నవలో కాదండి కాగితంమీద రాసివ్వడానికి. అనుభవంతో, దేనిలో ఏది ఎంత పరిమాణంలో వేస్తే రుచిగా ఉంటుందో తెలుసుకోవాలంతే." కాగితం, పెన్నూ, ప్యాడూ, నా సరంజామా నా ముఖాన విసిరేసి వంటింట్లోకి విసవిసా వెళ్లిపోయింది మా ఆవిడ.

తల తీసేసినంత పనయ్యింది నాకు.

'ఇవ్వాళ బుధవారం. గురు, శుక్ర, శని...అంటే ఇంకా మూడు రోజులుంది ఆదివారం రావడానికి. మూడు రోజుల్లో మూడవ ప్రపంచ యుద్ధానికి ప్రిపేర్ అవవచ్చు. ఆఫ్టరాల్...వంట నేర్చుకోవడమెంత! కష్టమైనా సరే, ఓసారి వంట నేర్చిపారేసుకుంటే ఈ ఆడవాళ్ల నోళ్లకి తాళం వేసెయ్యవచ్చు. ఏదో ఒకటి చెయ్యాలి. చెయ్యాలి కాదు; చేసి తీరాలి.' కసిగా, పట్టుదలగా అనుకున్నాను.

***

ఆఫీసునుండి తిరిగొస్తూ, ఆబిడ్స్‌లో ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర బస్సులోంచి గభాల్న దూకేసి, ఓ పెద్ద బుక్‌షాపులోకి జొరబడ్డాను... మంచి వంటల పుస్తకమేదైనా కొందామని. ముందుగా ఇంగ్లీషు సెక్షన్‌వైపు నడిచాను. 'మీ నోరూరించే నూటొక్కవంటకాలు', 'అరచేతిలో అద్భుతమైన వంటలు'...అని అర్థం వచ్చే రకరకాల ఇంగ్లీషు టైటిల్స్‌తో, అయిదు నక్షత్రాల హోటళ్లలో పనిచేసే నలభీముల రచనలు కంటబడ్డాయి.

ఓ పుస్తక మందుకుని చకచకా పేజీలు తిరగేశాను. అన్నీ నోరు తిరగని నార్త్ ఇండియన్, ఇంటర్ కాంటినెంటల్ వంటకాల పేర్లు. పైగా వాటిని తెలుగులో ఏమంటారో తెలిసి చావని మసాలా దినుసు లొకటి. ఏ శంకరనారాయణ ఇంగ్లీషు...తెలుగు డిక్షనరీయో, బ్రౌను నిఘంటువో తీసుకుని వాటి అర్థాలు వెతుక్కుంటూ కూర్చుంటే పుణ్యకాలం కాస్తా దాటిపోతుంది. ఇవి మనకు వర్కవుట్ కావనుకుని షెల్ఫులో పెట్టేసి, తెలుగు సెక్షన్‌వైపు నడిచాను. 'మీకు వంట నేర్చుకోవాలనుందా?' అనే ఆకర్షణీయమైన పేరుగల పుస్తకా న్నొకటి కొనుక్కుని బయటపడ్డాను.

***

ఆదివారం దగ్గర పడుతున్నకొద్దీ విషాద మేఘాలు నన్ను అలుముకోసాగాయి. గుండెల్లో ఏదో చెప్పరాని గుబులు. ఆఫీసులో అటూ ఇటూ హడావిడిగా తిరుగుతూ, ఎప్పుడూ ఏదో ఒకటి వాగుతుండే నేను...ఉన్నట్టుండి

ముభావంగా మారేసరికి సహోద్యోగు లందరూ ఆశ్చర్యపోయారు.

ప్రతిరోజూ సాయంత్రం ఇంటికి రాగానే, వంటల పుస్తకం శ్రద్ధగా చదవడమూ, విషయం బాగా నచ్చినచోట రెడ్ బాల్ పెన్నుతో అండర్ లైను చేసుకోవడం అలవాటైంది. కొబ్బరిపొడి, ఉప్పు, కారం మా ఆవిడ షెల్ఫులో ఎక్కడ పెడుతుందో గమనించడమే కాకుండా, మధ్యమధ్యన కళ్లు మూసుకుని అవెక్కడ ఉంటాయో గుర్తు పట్టడం కూడా ప్రాక్టీసు చేశాను.

ప్రదర్శన రోజు స్టేజీమీద నాటకం రక్తి కట్టాలంటే, తప్పకుండా ప్రతిరోజూ రిహార్సల్సు చేసి తీరాల్సిందే, ... అన్న అభిప్రాయం నాది.

రోజురోజుకీ వంటమీద నాకు పెరుగుతున్న ఆసక్తి చూసి కాబోలు...మా ఆవిడ మురిసిపోవడం నేను స్పష్టంగా గమనించాను.

***

ఆదివారం రానే వచ్చింది చివరకు.

ఉదయం ఆరింటికే, చేతిలో కేవలం ఓ పాలిథిన్ బ్యాగ్ ఊపుకుంటూ తన చెల్లెలింటికి బయలుదేరింది మా ఆవిడ. మొదటినుంచీ పెద్ద బిల్డప్ ఇస్తున్నానుగానీ, మా ఆవిడగారి చెల్లెలుండేది ఆరు సముద్రాల ఆవలేమీ కాదు; ఇదే హైదరాబాదులోనే!

సిటీ బస్సులో ఆవిడ నెక్కించేసి, వస్తూవస్తూ దారిలో మార్కెట్ దగ్గర ఆగిపోయాను. ఇంతకీ అన్నంలోకి ఏ కూర వండాలి. అసలు సంగతే ఇంకా డిసైడవ్వలేదు మరి.

"పప్పా? ఏం పప్పు? టొమాటో పప్పు! రోజూ మా ఆవిడ చేసేదేగా! దోసకాయ పప్పయితే! మరి జలుబు చేస్తుందేమో! ఐనా, చూపులతో చేదు దోసకాయను కనిపెట్టడం ఆ విధాత వల్ల కూడా కాని పని! పోనీ పాలకూర పప్పు! గడ్డీ, గాదం వేరు చేస్తూ ఆ ఆకు ఏరేసరికి భుజాలు పడిపోతాయి బాబూ! అయితే పప్పు కాకుండా ఏదైనా కూరగాయయితే!

"సింపుల్‌గా తరిగేసి, చకచకా వండేయొచ్చు! సరేగాని ఏ కాయగూరయితే బావుంటుంది? వంకాయ! ఆ పుచ్చు లేరడానికి విష్ణుమూర్తి దిగిరావలసిందే! సొరకాయ! అబ్బే! ఏది లేతదో, ఏది ముదురుదో విశ్వనాథుడికే తెలియదు, బోడి మనమెంత? ఈ కూరగాయలు మనకు సూటవ్వవుగాని నాన్ వెజ్ అయితే... అమ్మో! అదరగొట్టేయచ్చు! కథ బావుండకపోయినా, హీరో ఇమేజ్‌ని బట్టి ఆడే సినిమాలాగా, రుచి బావుండకపోయినా, ఐటమ్ మీది క్రేజ్‌నిబట్టి లాగించేస్తారు పిల్లలు!" అనుకుని చివరకు 'చికెన్ కర్రీ' ఒకే చేశాను!

మంచి వయసులో వున్నదీ, బాగా కండపట్టి ఆరోగ్యంగా, చలాకీగా వున్న పుంజు నొకదాన్ని చేత్తో పైకిలేపి 'అర్జెంటుగా దీన్ని సిద్ధంచేసి ఇచ్చేయవోయ్, ఇంటికి అతిథులొచ్చారు!" అబద్ధమాడాను చికెన్ సెంటర్ వాడితో.

రాగానే చికెన్ వంటింటి గట్టుమీద పెట్టి, ప్యాంటూ, షర్టూ మార్చుకున్నాను. లుంగీ అయితే మాటిమాటికీ వూడిపోతూ చికాకు తెప్పిస్తుందని, ఎన్నడో కొనుక్కొని మూలన పడేసిన 'షార్ట్స్'ని అలమరా లోంచి తీసి వేసుకున్నాను. 'బ్రహ్మాండంగా సూటయింది!" నన్ను నేను అభినందించుకున్నాను, వుండబట్టలేక!

గ్యాస్ సిలిండర్ ఎలా తెరవాలో ఎలా కట్టేయాలో రిహార్సల్ చేసి చూసుకున్నాను. అనుకోకుండా మంటలు చెలరేగితే, ఎలా అదుపు చేయాలో పిల్లలకు ముందే విపులంగా వివరించి చెప్పాను. ముందు జాగ్రత్త చర్యగా, బాల్చీ నిండా నీరు నింపి అందుబాటులో పెట్టుకున్నాను. ఎందుకైనా మంచిదని, ఫైర్ స్టేషన్ నెంబర్ కూడా ఒకటికి రెండుసార్లు మననం చేసుకున్నాను, గాయత్రి మంత్రం లాగా!

ఆ తర్వాత వంటకు అవసరమయ్యే దినుసులన్నింటినీ, షెల్ఫ్‌లోంచి తీసి దగ్గర్లో గట్టుమీద పెట్టుకున్నాను. 'మీకు వంట నేర్చుకోవాలనుందా?' పుస్తకంలో చికెన్ కర్రీ గురించి రాసిన దగ్గర ట్యాగ్ పెట్టుకుని, షెల్ఫ్‌లో వుంచాను ఎదురుగా!

చికెన్ ముక్కల్ని ఒక్కొక్కదాన్నీ ఏదో అపూర్వ విషయం తెలుసుకుంటున్న ఓ శాస్త్రవేత్తలా చూస్తూ, ఓపిగ్గా శుభ్రపరిచేసరికి గంటకు పైనే పట్టింది. వంటకు నీట్‌నెస్ అన్నది చాలా ముఖ్యం కదా మరి!

వంటగిన్నెను స్టౌ మీదుంచి, కాస్త వేడెక్కాక నూనె వేయబోయాను. కిలో చికెన్‌కు ఎంత నూనె వేయాలి? "మూడు చెంచాలు చాలు!" ఎప్పుడో, ఎక్కడో భార్యామణి సెలవిచ్చిన మోతాదు, భర్తృహరి సుభాషితంలా గుర్తొచ్చింది. కాని మూడు చెంచాలంటే ఏ మూడు చెంచాలు? రకరకాల చెంచాలున్నాయి యింట్లో!

బాగా ఆలోచించి, చిన్న చెంచానే ఎన్నుకున్నాను. నూనె తక్కువనిపిస్తే, మధ్యలో ఇంకాస్త కలుపుకోవచ్చు! కాని అదే ఎక్కువనిపిస్తే ఎలా తగ్గించగలం?

"ఔరా, ఏం లాజిక్కునీది? చూడ్డానికి అలా వున్నావు గాని!" నన్ను నేనే మెచ్చుకున్నాను. ఆ పనిచేయడానికి పక్కన మరెవ్వరూ లేకపోవడంతో!

నూనె సలసల మరగడం మొదలయ్యాక, వుల్లిపాయ ముక్కల్ని అందులోకి విసిరేసి గభాల్న పక్కకి గెంతాను, ముఖం మీద నూనెక్కడ చిందుతుందోనని! దాంతో పక్కనే వున్న బాల్చీ కాస్త దొర్లి వంటింట్లో వరదలు మొదలయ్యాయి.

కంగారుగా గుడ్డ వెతుక్కుని, నీళ్లు ఎత్తేసరికి వుల్లిపాయ ముక్కలు కాస్త మాడి, మసైపో



**శమిత దశ తిరిగిందా?**

'మొహబ్బతే'లో ముగ్గురు హీరోయిన్లలో ఓ అమ్మాయిగా నటించాక, నటి శమితాశెట్టికి మరో మంచి ఛాన్సే తగల్లేదు. అటు తరువాత "శరారా శరారా" పాటతో ఐటమ్ గర్ల్‌గానే మిగిలిపోయింది. హీరోయిన్ పాత్రలు అసలు రాలేదు. ఇప్పుడు 'అగ్నిపంఖ్'లో శమిత హెలికాప్టర్ పైలట్‌గా చేస్తున్నది. ఫెలిన్ మెహతా నిర్మిస్తున్న ఈ చిత్రంలో రాహుల్ దేవ్, నవోదిత్ తేజ్, దివ్యాదత్తా ప్రధాన భూమికలు చేస్తున్నారు. —ఎస్.

యాయి! స్టౌ ఆర్పేసి, ఆ గిన్నె పక్కన పడేసి మరోగిన్నెలో వంట ఫ్రెష్‌గా ప్రారంభించాను. మళ్లీ 'ఎ' ఫర్ 'ఆపిల్'!

కాగుతున్న నూనెలోకి, వుల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్, షాజీరా వగైరా వేసిన తర్వాత నెమ్మదిగా చికెన్ ముక్కల్ని గిన్నెలోకి జారవిడిచాను. పెదాలు బిగబట్టి! ఇప్పుడో పెద్ద ధర్మసంకటమొచ్చి పడింది! కారం ఇప్పుడే వేయాలా, కాస్త వుడికాక వేయాలా?

ఆ సంగతి వంటల పుస్తకంలో ఎక్కడా విడమరచి రాయలేదు. నా కర్మానికి! 'ఆ మాత్రం ఇంగితం లేకపోతే ఎలా?' అని అనుకొని వుండొచ్చు ఆ పుస్తకం రాసినతను. ఇప్పుడు ఎవర్ని అడగాలి? ఇలాంటి సందర్భాల్లో మొహమాటం పనికిరాదనుకుని నేరుగా మా మరదలు గారింటికే ఫోను చేశాను. మా ఆవిడ దొరుకుతుందన్న ఆశతో! కాని మా ఆవిడ కాకుండా, మరదలు గారు లిఫ్ట్ చేశారు ఫోను!

ఆమెనేమని అడగాలి? ఎలా అడగాలి? మరీ నేరుగా కూరలో వేసే కారం సంగతి అయితే బావుండదనుకుని ఆపరేషన్ చేసిన డాక్టర్ పేరు, ఆపరేషన్ జరిగిన తీరు, తీసుకుంటున్న మందులు వగైరా తాపీగా ముచ్చటిస్తుంటే, స్టౌమీద గిన్నెలోంచి వింత వింత శబ్దాలు వినిపించసాగాయి!

దానితో "సరేనమ్మా! నీ ఆరోగ్యం జాగ్రత్త!" మృదువుగా చెప్పకుండా, ఓ మిలిటరీ కమాండర్ లాగా హుకూం జారీచేసి వంటింట్లోకి పరుగుతీశాను. ఏమయిందో ఏమోగాని, గిన్నె అంతా సహారా ఎడారిలాగా దర్శనమిచ్చింది. ఒక్క నీటి చుక్కలేదు! 'బాబోయ్' అని బిగ్గరగా అరిచేసి ఓ గ్లాసెడు నీళ్లు గుమ్మరించి, గరిటెతో చకచకా కలిపాను కూరంతా! ముక్కలు సగం వుడికాక, కారం పొడివేసి వాకిట్లోకి వచ్చి నిలబడ్డాను రిలీఫ్ కోసం!

"బాబూ! అటక మీద బియ్యం బస్తా వుంది. దింపి పెడతావా? బీడీలకు డబ్బులిస్తాను!" పక్కింటావిడ ఎవరినో అడుగుతూంటే వెనక్కి మళ్లీ చూశాను.

"అయ్యో, అన్నయ్యా! మీరా?" నోటికి చేయి అడ్డం పెట్టుకుని నవ్వుతూ యింట్లోకి పరుగు తీసిందావిడ.

ఓసారి నావంక నేను జాలిగా చూసుకున్నాను. పక్కింటావిడే కాదు. ఎవరైనా అలాగే పొరబడతారు నన్నా వేషంలో చూస్తే! కింద షార్ట్, పైన పాతబడ్డ వదులుచొక్కా, భుజమ్మీద తువ్వాలు! జరిగిన అవమానానికి ఇంకాసేపు విచారిస్తూ



## పార్టీ ఇచ్చిందట!

ఈ ఏడాది ఫిబ్రవరి 14న-అంటే కచ్చితంగా వాలెంటైన్స్ డే-మాన్య (మనీషాకోయిరాలా ముద్దు పేరు) తన ప్రియుడు సెసిల్‌తో హాయిగా గడుపుదామనుకుంది. అతను పనితో బిజీగా వుండిపోయి, ఇండియాకు రావటం కుదరదన్నాట్ట. మరి ఆ దుఃఖంతో కాలం వ్యర్థం చేయటం ఇష్టం లేని మాన్య, తన స్నేహితురాళ్లందరినీ, "మాంచి భోజనం, మాంచి వైన్, చక్కని కబుర్లు ఇష్టమున్న వాళ్లంతా రావచ్చునోహో!" అని ఫోనులో ఎలుగెత్తి పిలిచి మరీ చెప్పిందట. ఆమె దగ్గరివారైన సుస్మిత, తబ్బూ రాలేకపోయారు కానీ, సుమన్ రంగనాథన్, తదితరమైన పార్టీగతప్రాణులు పొలోమంటూ తరలివచ్చార్ట. భలే ఐడియా కదూ?

ఎన్.

కూర్చుండే వాణ్ణే కాని పొయ్యిమీద కూర గుర్తొచ్చి పరుగుతీశాను.

మూత తెరిచి చూద్దును గదా ఆనవాలుకైనా కనిపించలేదు కూరలో ముక్కలు! అన్నీ కరిగిపోయి, కూరంతా పేస్ట్‌లా తయారైంది. వండిన వాళ్లు దయతలచి చెబితే తప్ప, అది కోడికూర అని ఏ మానవుడూ గుర్తుపట్టలేని విధంగా వుందది! వంట పొలాల మీద ఎరువులు చల్లినట్లు, ధనియపొడి కాస్త కూరమీద వెదజల్లి, స్టౌ మీద నుండి దించేశాను. అన్నం కూడా అయింతర్వాత టైం చూసుకున్నాను. మధ్యాహ్నం రెండైంది!

పిల్లలిద్దరూ ఆదరా బాదరగా ప్లేట్లు తెచ్చుకుని, టేబిల్ ముందు కూర్చున్నారు. ఆకలితో నీరసించిపోయారు కాబోలు! గిన్నెలోది ఏం కూరో పోల్చుకోవడానికి వాళ్లకి ఐదు నిముషాలు పట్టింది!

నోట్లో ముద్దపెట్టుకోగానే, నావంక అదోలా చూశారు వాళ్లు. 'ఇంత వయసొచ్చాక, ఇలాంటి పనులు చేయడానికి సిగ్గుగాలేదూ!' అన్నట్లున్నాయి ఆ చూపులు. అటూ, ఇటూ కెలికి రెండు ముద్దలు తిన్నాక "అంత ఆకలి అనిపించడం లేదు డాడీ! అంటూ ప్లేట్లు సింకులో పడేశారు!

ఇంటికి పెద్ద దిక్కు, నేను కూడా బాగులేదంటే బాగుండదని ఏదో ప్రాణాన్ని నిలబెట్టే మందులాగా నాలుగు ముద్దలు నోట్లో కుక్కుకుని, నడుం వాల్చాను.

00000

ఏదో కాస్త తిన్నామన్న మాటేగాని, ఆకలి తీరక చాలా నీరసించి పోయాము నేనూ, పిల్లలూ. ఇంకాసేపట్లో తగిన ఆహారం అందకపోతే గ్లూకోజు ఎక్కించేలా వుంది మా పరిస్థితి. టీవీ. చూస్తున్నట్టు నేల మీద పడుకొని, దొర్లుతున్నాం గాని మా చూపులన్నీ గేటువైపే!

సాయంత్రం ఏడవుతుంటే, వచ్చింది మా ఆవిడ. రాగనే ఇల్లంతా చూసి, ముఖం చిట్లించి చీపురు అందుకుంది.

"రాత్రికేమైనా చేయాలా? లేక పొద్దుటిది సరిపోతుందా?" అని మా ఆవిడ అనగానే పిల్లలిద్దరూ నా వంక చూశారు, సమాధానం నేను చెబితేనే బావుంటుందన్నట్లు. దోషిలా తలవంచుకున్నాను, చేసేది లేక. శ్రీమతి చకచకా వంటింట్లోకి వెళ్లి, కూరగిన్నె తీసి చూసింది. ఏమనుకుందో, ఏమో కుక్కర్లో కాసిన్ని బియ్యమూ, కాసింత పప్పూ వడేసి స్నానానికి వెళ్లింది.

ఆమె అలా స్నానం ముగించుకొని వచ్చేసరికి, కుక్కర్లోంచి పప్పు తాలూకూ కమ్మటి వాసన ముక్కుపుటాల్ని అదరగొట్టసాగింది. ఎన్నాళ్లుగానో నిరాహారదీక్ష చేసి నీరసించిన వాళ్లలాగా ఏడున్నరకే ఆవురావురుమంటూ గిన్నెలమీద దాడి చేశాం నేనూ, పిల్లలూ!

నేను వండిన కూర చూసో, లేక ఆపరేషనయిన తన చెల్లెలి ఆరోగ్య పరిస్థితి చూసోగాని మా ఆవిడ గంభీరంగా వుండడం గమనించాను.

రాత్రి పదకొండున్నరకు, పిల్లలిద్దరూ నిద్రపోయాక మా ఆవిడ భుజం మీద చేయివేసి అన్నాను: "ఎలాగైనా సరే, త్వరలో నేను వంట చేయడం నేర్చుకుంటాను లేవే!"

అందుకామె సన్నగా నవ్వి "మీకో సంగతి తెలుసా? భర్తకు వంట చేయడం రాకుంటే, భార్య చాలా సంతోషిస్తుంది. కనీసం ఆ రకంగానైనా తన గుప్పిట్లో వుంటాడని!" అంది మా ఆవిడ. 'ఐతే, నీకు నామీద అస్సలు కోపం లేదన్న మాట!" అంటూ నడుం మీద చేయివేసి మా ఆవిడను దగ్గరకు లాక్కున్నాను! ■